సమస్యలతో సహవాసం

మరమ్మతులకు నోచుకోని బోర్లు

శిథిలావస్థలో రహదారులు

గెడ్డల్లో పేరుకు పోతున్న వ్యర్థాలు

పట్టించుకోని అధికారులు

శిథిలమైన రహదారులు.. రోడ్డుపైనే చెత్త.. గెడ్డల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు.. పని చేయని మంచినీటి బోర్లు.. ఇలా సమస్యలతో సహజీవనం చేస్తున్నారు దక్షిణ నియోజకవర్గ పరిధిలోని పలు వార్డుల్లో ప్రజలు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు దృష్టి సారించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 29, 30, 31, 32, 33, 35, 37, 38, 39 వార్డుల పరిధిలోని ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఎన్నికలు వస్తేనే నాయకులు ఇటువైపు వస్తున్నారని, లేదంటే తమను పట్టించుకోవడం లేదని ఇక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

– డాబాగార్డెన్స్



డాబాగార్డెన్స్ ప్రేమ్‌లేట్ జంక్షన్ దారిలో మూలకు చేరిన తాగునీటి బోరు

తప్పని నీటి కష్టాలు

వార్డుభాయికాలనీ, అల్లిపురం, వెంకటేశ్వరమెట్ట, తాడివీధి, ప్రసాద్ గార్డెన్స్, పెరికివీధి, వెలంపేట, లక్ష్మీనగర్, సాలిపేట తదితర ప్రాంతాల్లో మంచి నీటి బోర్లు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో స్థానికులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఆయా ప్రాంతాల్లోని బోర్లు సరిగా పనిచేయడం లేదు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్నా, పూర్తిగా సరిపోకపోవడంతో బోర్లపైనే ఆధారపడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.



రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డులో పైపు లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

రోడ్లు ఇలా.. రాకపోకలెలా?

రెల్లివీధి, కలెక్టర్ కార్యాలయం నుంచి ఏవీఎన్ కళాశాలకు వెళ్లే రోడ్డు, పోలీస్ క్లబ్ ఏరియా, పాతనగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు పూర్తి శిథిలావస్థకు చేరాయి. దీంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



టౌన్‌కొత్త రోడ్డు వద్ద ప్రధాన రహదారి ఇలా..

మా బాధలు వినేవారేరి?

మురికివాడ ప్రాంతాల్లో దీర్ఘకాలిక సమస్యలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. తాత్కాలిక పరిష్కారం చూపుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. వేసవి వచ్చేసింది. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి.

– సారిక దైవకుమార్, ఆశిపాపవీధి

రోడ్లు వేయాలి

సమస్యలతో సహవాసం చేస్తున్నాం. ప్రధానంగా శిథిలమైన రోడ్లతో ఇబ్బందులు పడుతున్నాం. రాకపోకలు సాగించే సమయంలో పలుమార్లు ప్రమాదాల బారినపడ్డాం. ఈ దుస్థితిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు.

– సుధాకర్, ఏవీఎన్ కాలేజ్ డౌన్ ఏరియా

పారిశుధ్యం అధ్వానం

మురికివాడ ప్రాంతాల్లో నిత్యం పారిశుధ్య సమస్య ఉంటోంది. ప్రధాన రహదారులు, కాలువలు శుభ్రం చేస్తున్నా.. వీధుల్లోకి వచ్చేసరికి ఆ పరిస్థితి కనిపించడం లేదు. మురుగు, చెత్తా చెదారాల నిల్వలతో అంటురోగాల బారిన పడతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



36వ వార్డు చెంగల్రావుపేట జామియా మసీదు వద్ద ఇలా..

క్లుప్తంగా

సైబర్ మోసాలపై అప్రమత్తం



దొండపర్తి వాసులకు అవగాహన కల్పిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ

సీతమ్మధార: సైబర్ క్రైం మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ సూచించారు. దొండపర్తిలో బుధవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనధికార చీటీలు వేసి మోసపోవద్దని స్థానికులకు హితవు పలికారు. ఆన్‌లైన్ రుణాల యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాలికల మిస్సింగ్ కేసులు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలు, అల్లర్లు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ గస్తీ ముమ్మరం చేశామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఫోర్త్ టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, మక్బూద్ అహ్మద్

డాబాగార్డెన్స్: రంజాన్‌ను పురస్కరించుకుని ఏఎన్ బీచ్ హాస్పిటల్ అధినేత, స్వామి వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్బూద్ అహ్మద్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వివేకానంద సంస్థ మహిళా సభ్యులు, పరిసర ప్రాంత పేద మహిళలకు బుధవారం వీటిని అందజేశారు. డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ వివేకానంద సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం రంజాన్ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వహస్తాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన వస్త్రాలతో, పుష్పాలతో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ సిబ్బంది సత్యనారాయణ రాజు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ స్టీల్ కబడ్డీ రన్నరప్‌గా విశాఖ స్టీల్‌ప్లాంట్

ఉక్కునగరం: జాతీయ ఇంటర్ స్టీల్ కబడ్డీ పోటీల రన్నరప్‌గా విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు నిలిచింది. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో రూర్కెలాలో ఈనెల 17 నుంచి 19 వరకు జాతీయ స్థాయి ఇంటర్ స్టీల్ కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తొమ్మిది స్టీల్‌ప్లాంట్లకు చెందిన జట్లు పాల్గొన్నారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భిలాయ్ జట్టు 39–34 స్కోరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై గెలుపొందింది. ఈ సందర్భంగా జట్టు క్రీడాకారులు మొల్లి అప్పలరాజు (కెప్టెన్), ఉరుకూటి అప్పారావు, శివకుమార్, ఎం.సురేష్, ఐ.అప్పలరాజు, రాజాబాబు, తేజు, దుర్గాప్రసాద్, ప్రసాద్, హరీష్, హేమత్, మహేష్‌లను జట్టు మేనేజర్ సత్యం, కోచ్ దేముడు అభినందించారు.

17మంది స్టాఫ్ నర్సులకు ట్యూటర్లుగా పదోన్నతి

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని 17 మంది స్టాఫ్ నర్సులకు నర్సింగ్ కాలేజీ, స్కూళ్లలో ట్యూటర్లుగా పదోన్నతి లభించింది. ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణి, డిప్యూటీ డైరెక్టర్ అంజయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్ రామ్మోహన రావు ఆధ్వర్యంలో బుధవారం వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాంతాలకు పదోన్నతితో కూడిన బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధారాణి మాట్లాడుతూ పదోన్నతులు పొందిన వారంతా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏపీ నర్సింగ్ అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్ కార్యదర్శి జి.వి.ఎస్. వరలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ ఇందిర మాట్లాడుతూ పారదర్శకంగా పదోన్నతులు జరిగాయన్నారు.

కూటమి పాలన అట్టర్‌ఫ్లాప్

- మా కార్పొరేటర్లు డబ్బుల ఎరకు చిక్కరు
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి



కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ పలువురు పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ చేసిన అభివృద్ధిని తమవిగా చూపిస్తూ కూటమి ప్రభుత్వం చిందులు వేయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ధ్వజమెత్తారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కేవలం 5 నెలల పదవీ వ్యామోహంతో తమ కార్పొరేటర్లకు డబ్బులు ఎరవేసి లాక్కునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కొంతమంది అధికార వ్యామోహంతో వైఎస్సార్‌సీపీని వీడినా, మిగిలిన వారంతా పార్టీని వీడే ప్రసక్తి లేదన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలో కూర్చున్న కూటమి ప్రభుత్వ 10 నెలల పాలన అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. కుటిల రాజకీయాల చంద్రబాబుతో పవన్ కల్యాణ్ ఒక రాజకీయ అసమర్థుడిగా మిగిలిపోయారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండి ఉంటే 75 వేల కోట్లు పేద ప్రజల ఖాతాల్లోకి చేరేవన్నారు. జగనన్న కన్నా ఎక్కువ సంక్షేమం అందిస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్.. ఇప్పుడు ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు. వారి చేతకానితనం వల్ల ఆనాడు జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన 17 మెడికల్ కళాశాలలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు.

రాష్ట్రంపై వైఎస్సార్‌సీపీ బ్రాండ్ ఇమేజ్

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ బ్రాండ్ ఇమేజ్ ఉందన్నారు. దానిని దెబ్బ తీయాలన్న ఆలోచనతో విపక్ష నాయకుడిగా జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం ఇవ్వకుండా అంకెల గారడితో, ఏకపక్షంగా అసెంబ్లీని నడిపిస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ నేతలపై అరాచకాలు, అక్రమ అరెస్టులు ఎన్ని చేయించినా జగనన్న అండగా ఉండగా, తాము ఎవరికీ భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 175 సీట్లు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుని, మళ్లీ జగనమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్, పార్టీ ఉపాధ్యక్షుడు చెన్నా జానకీరామ్, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా సెక్రటరీ పద్మనాభం అమ్మాజీ, జిల్లా ఆర్టీఐ అధ్యక్షుడు వద్దాది దిలీప్, పీతల వాసు, దళమంతుల మాణిక్యాలరావు, దళమంతుల చిన్ని, సౌత్ ఆర్టీఐ దొడ్డి బాపూ ఆనంద్, రాజారెడ్డి, ముత్తాబత్తుల రమేష్, లండా రమణ, అలపున కనకారెడ్డి, ముజీబ్‌ఖాన్, వాసుపల్లి బంగారమ్మ, సూర్యనాయుడు, షకీల్, బెవర మహేష్, ఆకుల శ్యామ్‌కుమార్, ఆరుగుల రాజు, సాగర్, బొడ్డు ధనరాజ, రఫీ, వేణు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పేరు తొలగించడం దుర్మార్గం

మధురవాడ అభివృద్ధి ఘనత వైఎస్సార్‌దే

విశాఖలో కూటమి నాయకుల దాదాగిరితో క్రికెట్ స్టేడియంకు వైఎస్సార్ పేరును రాత్రికి రాత్రి తొలగించడం దుర్మార్గమని వాసుపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. మధురవాడ నేడు అభివృద్ధిలో ఉందంటే ఆ ఘనత అక్కడి క్రికెట్ స్టేడియంకు అంతర్జాతీయ హోదా ఇచ్చిన మహానేత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ఆరిలోవ ప్రాంతం హెల్త్ సిటీగా మారిందంటే వైఎస్సార్ హయాంలోనే జరిగిందన్నారు.

జీవీఎంసీ బడ్జెట్ సమావేశం నిర్వహించాలని వినతి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ బడ్జెట్ సమావేశం వెంటనే నిర్వహించాలని సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మేయర్ గొలగాని హరివెంకటకుమారిని కోరారు. మేయర్‌ను బుధవారం ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. మార్చి నెల ముగింపునకు వస్తున్నా ఇప్పటివరకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ఆమోదానికి కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మేయర్ ఈ నెల 22 లేదా 29 తేదీల్లో సమావేశం నిర్వహించాలని జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌ను ఈ నెల 15న రాతపూర్వకంగా కోరినట్టు తెలిపారన్నారు.

రాష్ట్రప్రభుత్వ ఆదేశాలు అనైతికం

కౌన్సిల్ సమావేశం నిర్వహించవద్దని కలెక్టర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలివ్వడం అనైతికమని డాక్టర్ బి.గంగారావు తెలిపారు. దీనిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం జీవీఎంసీలోని 25 లక్షల మంది ప్రజల ప్రయోజనాలు దెబ్బతీయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. కలెక్టర్ ఈ నెల 30లోపు జీవీఎంసీ ప్రత్యేక బడ్జెట్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.

క్యూఆర్ కోడ్ సర్వేపై బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

మహారాణిపేట: ఆర్టీసీ బస్ స్టేషన్‌లలో వసతులకు సంబంధించి ప్రవేశపెట్టిన క్యూ ఆర్ కోడ్ సర్వేలో సిబ్బంది అందరూ పాల్గొనాలని ఏపీఎస్‌ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సూచించారు. ద్వారకానగర్‌లోని ఆర్‌ఎం కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి బస్‌స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, దానిని వినియోగించుకుని సర్వేను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా కోడ్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ సిబ్బంది పర్సనల్ ఆఫీసర్ తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్, అసిస్టెంట్ ఇంజినీర్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పార్చనలో మహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: మహారాణిపేటలోని అంబికాబాగ్ రామాలయ దేవస్థాన కల్యాణ మండపంలో బుధవారం మహాలక్ష్మి అమ్మవారి జయంతి నేత్రపర్వంగా సాగింది. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, వాసవీ క్లబ్ వనిత కేసీజీఎఫ్ వైజాగ్ ఫెమీనా సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 500 మందికి పైగా మహిళలు పాల్గొని అమ్మవారి మహా మంత్రాన్ని స్మరిస్తూ భక్తి శ్రద్ధలతో స్వర్ణ పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా మంగళధ్వని, వేదమంత్రాలతో అర్చకులు విఘ్నేశ్వర పూజ ఆచరించారు. మహాలక్ష్మి అమ్మవారికి అష్టోత్తరం, సహస్రనామాలతో కుంకుమార్చన జరిపారు. కార్యక్రమంలో వాసవీ గవర్నర్ టి.అమర్నాథ్, సంస్థ ప్రతినిధులు బి.వి.పద్మావతి, వంకాయల సాయి నిర్మల, సీహెచ్ చందన, కె.శారద, సి.నిరూపమ, ఎం.సీతా, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి మహా మంత్రాన్ని స్మరిస్తూ.. పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఏఎంసీ బ్యాడ్మింటన్ జట్టుకు కాంస్య పతకం



కెప్టెన్ భాను, టీమ్ సభ్యులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి

మహారాణిపేట: అంతర వైద్య కళాశాలల క్రీడా పోటీల్లో ఆంధ్రా మెడికల్ కాలేజీ విద్యార్థులు అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మార్చి 15 నుంచి 17 వరకు గన్నవరంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో ఏఎంసీ విద్యార్థులు కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ భాను, సభ్యులు డి.చరణ్ నారాయణ్, బి.అంబేడ్కర్, డి.ధనుష్, తరుణ్ శ్రీరామ్ తదితరులను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఎస్.ఎం.సంధ్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ (జనరల్) డాక్టర్ ఎ.కృష్ణవేణి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్. పాత్రుడు, స్పోర్ట్స్ కార్యదర్శి భాను సతీష్ విజేతలను అభినందించారు.

'స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్' రద్దు చేయాలి

- ఆ నిర్ణయాన్ని పార్లమెంట్‌లో ప్రకటించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో జేఏసీ నేతల డిమాండ్
- ప్రచార కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అఖిల పక్ష కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

అల్లిపురం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ రద్దు నిర్ణయాన్ని కేంద్రం పార్లమెంటులో ప్రకటించాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరింది. జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిజేఎస్ అచ్యుతరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ నేతలు ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ బి.నాగభూషణం, కన్వీనర్ ఎస్.కనకారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు 11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చి, స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఈ కుట్రను టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులందరినీ యథావిధిగా విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఏప్రిల్ 1న మహాధర్నా

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిల పక్ష కార్మిక ప్రజాసంఘాల జేఏసీ ఏర్పడి 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏప్రిల్ 1న జీవీఎంసీ వద్ద నిర్వహిస్తున్న శిబిరంలో వందలాది మందితో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్‌వీ కుమార్, ప్రభుత్వ రంగ పరిశ్రమల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎప్.జ్యోతీశ్వర రావు, బూసి వెంకటరావు, సురేష్, రమణ, లక్ష్మి, ఉరుకూటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత పన్నులొద్దు



ధర్నాలో మాట్లాడుతున్న బాలమోహన్‌దాస్

సీతమ్మధార: ఐదేళ్లకు ఒకసారి అద్దె విలువపై లెక్కించి పెంచవలసిన ఇంటి పన్నును క్యాపిటల్ విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుదలతో, పెనాల్టీతో పెంచడంపై ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ, గాంధీ సెంటర్ అధ్యక్షుడు బాల మోహన్‌దాస్ విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద విశాఖ అపార్ట్‌మెంట్స్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా) ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు.

బలిచ్చే మేకకు పెట్టే మేతలా స్టీల్‌ప్లాంట్ రివైవల్ ప్యాకేజీ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఇచ్చిన రివైవల్ ప్యాకేజీ బలిచ్చే ముందు మేకకు పెట్టే మేతలా ఉందని బాలమోహన్‌దాస్ అన్నారు. కానీ, స్టీల్‌ప్లాంట్‌ను బలిపీఠం నుంచి ఇంకా తొలగించలేదన్నారు. ఈ వైఖరిని కేంద్ర ప్రభుత్వం విడిచిపెట్టాలని కోరారు. వార్వా ప్రతినిధులు మాట్లాడుతూ ఆస్తి పన్ను రద్దు చేసి, అద్దె ఆధారిత ఇంటిపన్ను పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రాలు సంతకాలు చేసి, నగర మేయర్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పంపించినట్టు తెలిపారు. ఇళ్లలో స్మార్ట్ మీటర్లు బిగించరాదని వార్వా నివాస్ అధ్యక్షుడు సీహెచ్‌ఎల్‌ఎన్ శాస్త్రి కోరారు. కార్యక్రమంలో వార్వా సంస్థ ప్రతినిధులు బీబీ గణేష్, పిట్ట నారాయణమూర్తి, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్ ఉపసంహరణకు డిమాండ్



మాట్లాడుతున్న నాగ మల్లేశ్వరి

సీతంపేట: ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం వేసిన కమిషన్‌ను ఉపసంహరించుకోవాలని మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మంచాల నాగమల్లేశ్వరి డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని టచ్ చేసి అన్నదమ్ముల వలే ఉన్న తమను విడదీసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. గతంలోనే ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా జరగలేదని, దీనిపై కోర్టులో పిటిషన్స్ వేశామన్నారు. అయినప్పటికీ కూటమి మందకృష్ణ మాదిగ మెప్పు కోసం, హడావుడిగా కమిషన్‌ను వేసి, ఎలాంటి ప్రాతిపదిక లేని వర్గీకరణ చేయడం సరికాదన్నారు. రాజకీయ లబ్ధికోసం, రాజకీయ అవకాశాల కోసం జాతిని తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమగ్ర కుల గణన సర్వే జరగాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చెయ్యలేక, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆక్షేపించారు. ఎట్టి పరిస్థితుల్లో ఎస్సీ వర్గీకరణ జరగనివ్వబోమన్నారు. మాల మహానాడు నాయకులు త్రినాథ్, వెంకటరమణ, ధర్మవతి పాల్గొన్నారు.